# దృక్కోణాలు

హనుమంతరావు కాళ్ళు ఆ ఆఫీసు బిల్డింగ్ ముందు ఆగిపోయాయి. చాలా క్లిష్టమైన పని తను స్వీకరించాడు. దీంట్లో పెద్ద అనుభవం కూడా లేదు తనకి-తనమీదున్న అచంచలమైన విశ్వాసంతో బావగారు ఈ పని తన కప్పగించారు. ఎంతవరకు సఫలీకృతుడు అవుతాడో దేవుడికే తెలియాలి.

"ఎవరు కావాలండి?" వాచ్‌మన్ అడిగాడు అతన్ని అనుమానంగా చూస్తూ, ముందు కొచ్చి.

"సీతాపతి ఉన్నాడా?" తడబడి అడిగాడు.

"బయటెందుకు ఉంటాడు- లోపలికి పోతే కనిపిస్తాడు." నిర్లక్ష్యంగా చెప్పాడు వాచ్‌మెన్.

"అంటే ఈ రోజు ఆఫీసుకు వచ్చాడాని...?"

"నువ్వు పోయి చూడు- అయినా అతనితో నీకేం పని?"

"ఉందిలే - పర్సనల్."

"కొంచెం టీ డబ్బులు ఇప్పించండి."

"టీనా - సరే, పద - నేను కూడా వస్తాను."

ఇద్దరూ దగ్గరలో ఉన్న ఇరానీ హోటల్‌కు వచ్చారు.

"టిఫన్ చేస్తావు?"

"చెయ్యను అని అంటే బాగుండదు మరి, లాగిస్తాను." వాచ్‌మెన్ మొహమాటపడలేదు.

సర్వర్ రాగానే రెండు పరోటాలకు ఆర్డరిచ్చాడు.

"నీ ఆకలి తీరుతున్నది - మరి నా ఆకలి తీరుస్తావా?"

"బాగుంది వరస, ఏంటి కత?"

"సీతాపతి ఎలాంటివాడు.?"

"ఎందుకు?"

"ఇలా ఎదురు ప్రశ్నలు వేస్తే టిఫను కాన్సిల్!"

"అందరి లాంటివాడు."

"అంటే...?"

"నలుగురితో పాటు నారాయణ."

"నాకు కావలసింది సూటి జవాబు. అతని ప్రవర్తన బాగుంటుందా?"

"మరి స్వీటుకూడా ఇప్పిస్తే బాగుంటుంది. లేకపోతే లేదు." వాచ్‌మెన్ భీముడు చెప్పాడు.

"సరే కాని అది కూడా తిని ఏడు." సర్వర్ని పిలిచి స్వీటు తెమ్మన్నాడు.

భీముడు సుష్టుగా తిని తేన్చాడు.

"ఇప్పుడుచెప్పండి -సీతాపతి బాబుకు మీకూ ఏంటి సంబంధం?"

"ఇదిగో- బీరకాయపీచు సంబంధం ఉంది. నీ కనవసరం. అడిగిందానికి చెప్పు." కోపంగా అన్నాడు హనుమంతు.

"సీతాపతిని శంకిస్తే పురుగులు పడిపోతారు."

"అతనికి స్నేహితులున్నారా? ఒకడి అడ్రసు చెప్పు."

"టిఫను తిన్నతరువాత సిగరెట్టు తాగంది వెధవది బుర్ర పనిచేసి చావదు. "భీముడు కిల్లీషాపులో పాకెట్ తీసుకుంటూ అన్నాడు.

"రెండు మీతా కట్టు." అర్డరిచ్చాడు.

"చూడు నీకు కావల్సినవ న్నీ తీసుకుంటున్నావు – నా క్కావలసింది మటుకు ఇవ్వడం లేదు," విసుక్కున్నాడు.

"సీతాపతికి భవానీశంకరం బాబుక్లోజ్." అంటూ అతని అడ్రసు చెప్పాడు.

బ్రతుకుజీవుడా అంటూ అక్కడినుంచి బయలుదేరాడు హనుమంతు.

భవానీశంకరంను పట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు.

"నా పేరు హనుమంతు – మీతో మాట్లాడాలి". అతన్ని బయటకు పిలుచుకొస్తూ చెప్పాడు.

"కాని నేను మిమ్మల్ని ఎరగను."

"మీరు నాకు తెలుసు – మీ పేరు భవానీ శంకరం!"

"అలా అని పిలుస్తారు."

"నా కో చిన్న సాయం చేసిపెట్టాలి."

"ముక్కూ మొహం తెలీదు– అప్పుడే సాయం కావాలా? కొంప దీసి నువ్వు అప్పారావు కాదు కదా?"

"సాయం అంటే అప్పు కాదు. మాట సాయం."

"ఐ సీ! దాందేముంది పైసా ఖర్చుకాని పన్లు ఎన్నైనా చేస్తాను ఆంజనేయులు!"

"అయ్యో నా పేరు హనుమంతు."

"పేరులో ఏముందిలే ఆంజనేయులూ! ఏం కావాలో చెప్పు."

"సీతాపతి తెల్సా ?"

"తెల్సా! భలేవారే – నాకు బాగా దోస్త్!"

"అతనికి పెళ్ళి కాలేదు కదూ?"

"అని చెబుతుంటాడు."

"అంటే అయిందా?"

"కాలేదని చెబుతుంటాడు."

"అంటే చేసుకున్నాడా?"

"నాకేం తెలుసు? నే నేమన్నా చూశానా?"

"బాబ్బాబు! కొంచెం గజిబిజిగా ఉంది."

"నీ కర్మ! ఇంతకీ నీకు అతనితో ఏం పని?"

"మిమ్మల్ని చూస్తుంటే అబద్ధంఆడబుద్ధికావడంలేదు. మా అమ్మాయి నిద్దామని వచ్చాను."

"ఇంకేం ఇచ్చెయ్యి."

"ఇచ్చేముందు మీ సలహా అడుగుదామని."

"మళ్ళీ నన్ను ఇరికించడానికా?"

"ఎంత మాట? ఇంతకూ సీతాపతి ఒంటరివాడేనా?"

"ఆఁ! ఒంటరే! తుంటరి కాదు."

"అంటే - అతను జులాయిగా తిరుగుతుంటాడా?"

"అని ఎవరన్నారు?"

"తుంటరి అంటే..."

"తుంటరి కాదు అని కదా నే అంది!"

"అయితే పెళ్ళి గిళ్ళి కాలేదుగా?"

"ఏమో మరి! పెళ్ళి మటుకు కాలేదనుకుంటా గిళ్ళి సంగతి నాకు తెలియదు."

"బాబూ! కాస్త మందు పుచ్చుకున్నావా?"

"మందా? నాకేం జబ్బు లేదే!"

"ఆహాఁ! జబర్దస్తీగా ఉన్నవాళ్ళు కాస్త మందు పుచ్చుకుంటే బాగుంటుందని..."

"ఛ! ఛ! ఆఫీసు టైములో అటువంటి పనులు చేయకూడదు. సీతాపతి కూడా అదే మాటమీద నిలబడతాడు."

"సీతాపతికి మందు అలవాటుందా?"

"ఏం నీకు లేదా?"

"ఆఁ! ఎప్పుడన్నా - మనసు బాగోలేనప్పుడు."

"అంతే ! మేమూ అంతే - మనసు బాగోలేనప్పుడు కాస్త ఫుల్‌బాటిల్ చప్పరిస్తాం - కాకపోతే వయసులో ఉన్నాం కాబట్టి మనసు తరచుగా చెడిపోతూ ఉంటుంది."

"అదేం పాపం!"

"ఈ అమ్మాయిలున్నారు చూశారూ? - మనం వెంట పడినంతకాలం మనవంక కన్నెత్తి చూడరు. మనం వాళ్ళని వదిలేసి వేరే వాళ్ళ వెంబడి పడితే మన వెనుక తిరిగి తిరిగి ప్రాణం తీస్తారు."

"ఆఁ! సీతాపతి ఎవతినన్నా ప్రేమించాడా?"

"ఎవతినన్నా? తప్పు. నీకు తెలుగు వ్యాకరణం నేర్పిందెవరు? కొన్ని సందర్భాల్లలో బహువచనం వాడాలి. నిత్య బహువచనం ఆంజనేయులూ!"

"అంటే ఇద్దరమ్మాయిల్ని ప్రేమించాడా?"

"అబ్బా ! ఇంకా నీ పిసినారి బుద్ధి పోలేదు. మావాడికేం ఖర్మ ఒకళ్ళ నిద్దరిని ప్రేమించడానికి? వాడి మనసు పుష్పక విమానమయ్యా!"

"అంతేనా - ఇంకా ఏమైనా అలవాట్లున్నాయా?"

"మావాడు చాలా ప్రిన్సిపుల్డులేండి. శనివారం రెడ్ లైట్ ఏరియాకు ఛస్తే వెళ్ళడు."

"నువు బాబూ?"

"చెప్పాలా? వాడితో చేరి నాకూ అది వంటబట్టింది. ఇంతకూ అమ్మాయి ఎలాంటిది? రంభా? ఊర్వశా? మేనకా? విశ్వామిత్రా?"

"అప్పలనర్సమ్మ !" కసిగా అన్నాడు హనుమంతు.

"పర్లేదు - ఏమాత్రం తీసుకొస్తుంది? ఎన్ని లకారాలు? ఎన్ని సవర్లు?"

"అయితే బాబూ సీతాపతికి మా అమ్మాయిని ఇమ్మంటావా?"

"లక్షణంగా – మాలాంటి వాడు దొరకడం కష్టం."

"నీకు పెళ్ళయిందా నాయనా? అయితే ఆ ఇల్లాలు ఇంకా కాపురం చేస్తున్నదా?"

"నా కొద్దులేండి – మొన్ననే మూడో పెళ్ళి అయింది. నాలుగో దాన్ని ప్రస్తుతానికి చేసుకునే ఆలోచనలేదు. అరే ! అలా పరుగెడతావేమిటయ్యా ఆంజనేయులూ?"

అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా హనుమంతు పరుగెత్తు కొచ్చేశాడు.

అతికష్టం మీద సీతాపతి రూము అడ్రసు కనుక్కొని అక్కడికి వచ్చాడు. అతని రూమునుంచి మూడో ఇల్లు ఎన్నుకుని లోపలికి వచ్చాడు.

"ఎవరు కావాలి?" ముసలాయన బయటకొస్తూ అడిగాడు.

"సుదర్శనం గారు మీరేనా?"

"నేను కాదని ఎవరైనా చెప్పారా?"

"అంత ధైర్యం ఎవరి కుందిలేండి."

"బుద్ధిమంతుడి లాగున్నావు – కూర్చో ఏం కావాలి?"

"సీతాపతికోసం వచ్చాను. తను లేడు రూములో."

"ఓహో పతికోసమా? అప్పుడే ఇంటికి రాడు. రాత్రి పది దాటుతుంది అతనొచ్చేసరికి."

"అప్పటిదాకా ఏం చేస్తూ ఉంటాడు?"

"వచ్చిన తరువాత అడిగి కనుక్కో? వెధవ ప్రశ్న."

"తమరి కన్నీ తెలిసి ఉంటాయని అడిగాను."

"తెలిస్తే మటుకు అడ్డమైన వాళ్ళకూ అడ్డమైన ప్రశ్నలకు జవాబు చెబుతానని ఎలా అనుకున్నావు?"

"సీతాపతితో తమరికి బాగా పరిచయం ఉన్నట్లుంది."

"ఏం నీకు అభ్యంతరమా?"

"అబ్బే ! వాడికి కావల్సినవాళ్ళు – నాక్కావల్సినవాళ్ళు."

"అయితే – నా కవతల బోల్డు పన్లున్నాయి."

"మీ టైం వేస్టు చెయ్యను. మా పతిమీద మీ అమూల్యమైన అభిప్రాయం చెబితే సెలవు తీసుకుంటాను."

"లక్ష కట్నం ఇవ్వచ్చు."

"అయ్యబాబోయ్, అదేం మాట?"

"అంతేనయ్యా! ఆత నున్న ప్రస్తుత మార్కెట్ విలువ ఓ లక్ష!"

"లక్షంటే మీకు లక్ష్యం లేనట్లుంది."

"ఊరుకోవయ్యా ! ఆడపిల్లల తండ్రిని – నాకు అబ్బాయిల ధర తెలీదా? నీ ధర పది కంటే పలకదు ఫో!"

"సంతోషం ! నేనే పది ఎదురివ్వాలేమో అని భయపడుతున్నా."

"ఏయ్ రంగీ ! ఇట్రా మీ సీతాపతి ఉన్నాడా?" రోడ్డుమీద పోతున్న ఓ పడుచుపిల్లను చూసి కేకేసి అడిగాడు సుదర్శనరావు.

"ఏటండీ – మా పతిబాబు – లేడండి." రంగి మెలికలు తిరుగుతూ చెప్పింది.

"వస్తాను నాకు బోల్డు పన్లున్నాయి." రంగి వెళ్ళిపోయింది.

"మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాను సుదర్శనంగారు నాకు సెల విప్పియ్యండి."

వెంటనే లేచి నిల్చున్నాడు.

వెంటనే రంగీ వెంట పడ్డాడు. రంగికి అతను తాన్ని అనుసరిస్తున్నట్లు అనుమానం వచ్చి ఆగి వెనక్కి తిరిగి చూసి కిసుక్కున నవ్వింది. రెండంగల్లో ఆమె పక్కకు వచ్చి నడవసాగాడు.

"ఏ య్ రంగీ! పతిబాబు లేడా?"

"ఏటి తమరికి సెవుడా? సెప్పానుగా లేడని."

"రంగీ! డబ్బులు కావాలా?"

"ఏయ్! నాను ఏటనుకుంటున్నావు?" కోపంగా అంది.

"అబ్బే! అది కాదు నా ఉద్దేశం. నా కో చిన్న పని చేసి పెడితే నీ కో పాతిక ఇస్తాను." జేబులోంచి నోట్లు పైకి తీసి లెక్కపెట్టుకుని లోపల పెట్టుకున్నాడు.

రంగి కళ్లు మెరిశాయి – "ఈడ కాదు. అలా దేవాలయంలోకి పోదాం". అంటూ పక్కనే ఉన్న గుడికి దారితీసింది.

"ఈ వయసులో ఇదేటి బుద్ధయ్యా నీకు?"

"ఛీ! ఛీ! అందుగ్గాదు పిల్చింది – ఇంకో పనుంది."

"ముం దా డబ్బివ్వు – ఇప్పుడు సెప్పు ఏటో." జాకెట్లో నోట్లు దాచుకుంటూ అడిగింది రంగి.

"సీతాపతికి మా అమ్మాయిని ఇవ్వాలి ఆ బాబు ఎటువంటివాడు? నీకు బాగా తెల్సుండాలి చెప్పు."

"హుఁ ! ఈక ఈక ఈ పిల్లడికే ఇయ్యాలా !"

"అదేం ! పతి మంచివాడు కాదా?"

"మంచితనానికే బోల్డుంది. కాని..."

"ఆ కాని – ఉద్యోగం బాగోలేదా?"

"ఏటో – బానే ఉంటాది." చప్పరించింది. "ఇయ్యి."

"రంగీ ! నిజం చెప్పు. తోటి ఆడకూతురు గొంతుకొయ్యకు."

"నాను మనువు ఏడ సెడగొట్టను?"

"అతనికి ఇదివరకే పెళ్ళయిందా?"

"పెళ్ళా? బమ్మచారి."

"మరింకేం – కార్టెక్టరు బాగుందిగా."

"ఆడదానికి కావలసింది సతుకు, ఉద్యోగం కాదుగా."

"అందం, ఐశ్వర్యం ఉన్నాయిలే!"

"అన్నీ ఉన్నా.... సుకం ఇవ్వలేనోడుంటే ఎట్టా?"

"అంటే – సీతాపతి...?"

"నాకేం తెలవదు. కాని ఆ బాబు మటుకు నావంకెప్పుడూ సూడలేదు. నీ వయసోళ్ళు

కూడా దొంగుసూపులు నూస్తారు కాని, ఆ బాబు కా ధ్యాసేలేదు. ఆడ యావ లేదు."పెదవి చప్పరించేసింది.

"అంటే - ను వ్వెప్పుడన్నా..."

"య్యోవ్ - నా కేటికి పాపం? దేముడున్నాడు అడి మీద బరువేసి సేసెయ్యి - నానుపోతా." రంగి పైట విదిలించి విసవిస వెళ్ళిపోయింది ఎవరో రావడం చూసి.

హనుమంతు ఇంకా ఇద్దర్ని విచారించాడు.వాళ్ళు ఏదో చెప్పారు. ఒకడు అతనికేం జెమ్ అన్నాడు. ఇంకోడు ఒట్టి లోఫర్ అన్నాడు. ఒకడు అతను చాలా తెలివిగలవాడని చెప్పాడు. ఇంకోడు అతను చాలా తెలివి[illegible]వాడని చెప్పాడు. ఇంకోడు అతను కుటిలబుద్ధి గలవాడని సర్టిఫికెట్టు ఇచ్చాడు. ఒకడు అతను చాలా సిన్సియర్ అని బిరుదు ఇస్తే - ఇంకోడు అతను ఒట్టి చాదస్తపు పాతకాలపు మనిషి అని అసహ్యించుకున్నాడు.

వెరసి హనుమంతుకు జుట్టు పీక్కునే పరిస్థితి వచ్చింది. సందిగ్ధావస్థలో పడి రూము ఖాళీ చేసి రైల్వే స్టేషనుకు చేరుకున్నాడు. రైలు రెండు గంట లాలస్యంట !

హనుమంతుకు తనమీదే తనకు జాలి వేసింది.

రైళ్ళు వస్తున్నాయి - పోతున్నాయి.

జనం దిగుతున్నారు - ఎక్కుతున్నారు.

స్టేషన్ చాలా కోలాహలంగా ఉంది.

కాని హనుమంతు మనస్సు మటుకు అల్లకల్లోలంగా ఉంది. బావగారికి సీతాపతి గురించి ఏం చెప్పాలో అర్థం కావడంలేదు. తల వేడెక్కిపోతున్నది ఆలోచించేసరికి.

"అరే హనుమంతూ, ఇక్కడున్నావా?" అన్న పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చి, ఎదురుగా ఉన్న శాస్త్రీని చూశాడు.

"గుర్తు పట్టలేదా? నేన్రా వీరభద్రాన్ని."

"ఆరి పేనుగా ! నువ్వట్రా! ఎలా ఉండేవాడివి ఎలా అయిపోయావురా?" వీరభద్రంను కావలించుకుంటూ ఆశ్చర్యపోయాడు.

"అదేవిటి ను వ్విక్క డున్నావ్?"

"వైజాగ్‌కు పోయే ట్రైన్‌కోసం వెయిట్ చేస్తున్నా."

"హర్నీ ! నే నిప్పుడే వైజాగ్ నుంచి వస్తున్నాను. అయినా ఈ ఊ రెందు కొచ్చావ్?"

"కాస్తపని ఉండి. అయినా ను వ్వెందుకు వైజాగ్ వెళ్ళావు? ఉత్తరం రాసి ఉంటే కలిసేవాడిని."

"బాగుంది - ఆ మాత్రం అడ్రసు తెలిస్తే నే నే వచ్చేవాడిని గదా? కలిసి అయిదేళ్ళయిందా. అప్పట్నించి ఓ ఉత్తరం రాసి ఉంటే కలిసేవాడిని."

"బాగుంది - ఆమాత్రం అడ్రసు తెలిస్తే నే నే వచ్చేవాడిని గదా? కలిసి అయి దేళ్ళయింది. ఓ ఉత్తరం లేదు పత్తరంలేదు నీ రైలుకు ఇంకా ఆలస్యం ఉందిగా, అలా పోయి కాఫీ తాగొద్దాం పద"అంటూ క్యాంటీనుకు లాక్కుపోయాడు.

కబుర్లు దొర్లిపోయాయి - చిన్ననాటి సంగతులు, రాజకీయాలు వగైరాలు.

"హనుమంతూ! నువ్వు లేక నేనే భలే అవస్థపడ్డాను. చిన్న విషయం కనుక్కోలేకపోయాను. పిచ్చి ఎక్కిపోయిందిరా."

"ఏం జరిగిందో చెప్పు."

"సింపుల్! ఓ అమ్మాయి గుణం కనుక్కుందామని ఆమె చదివిన కాలేజికి వెళ్ళాను, ఓ లెక్చరర్‌ని అడిగాను. ఆ అమ్మాయికి తలపొగరు అని చెప్పాడు. బొత్తిగా క్లాసులో పాఠాలు వినేది కాదట. నిర్లక్ష్యంగా ప్రవర్తించేదిట. అన్నట్లు ఆమె కాలేజి బ్యూటీటలే! ఇంకేం బాయ్ స్టూడెంట్స్ తెగ వెంటపడి అల్లరి చేసేవాళ్ళుట! పాపం, అయింది – కాలేజీలో చదువుకున్న ఓకుర్రాడిని వాకబు చేశాను. అత నేమాంటాడో తెలుసా? ఆమెకు హృదయం లేదుట. 'రాయికన్న రాయివి నీవు – కసాయివి నీవు – ఓ ఓ హృదయంలేని ప్రియురాలా' అని పాడాడు. 'బాబూ ! నీ పాట వినడానికి రాలేదు – ఆమె గురించి చెప్పు' అని అడిగితే ఏమన్నా డో తెలుసా? ఆమె ఎందరినో పిచ్చివాళ్ళను చేసిందిట తన ప్రవర్తనతో – తనూ ఒకడట. పైగా ఏమన్నాడో తెలుసా? కట్టుకునే వాడు కూడా గ్యారంటీగా పిచ్చివాడవుతాట్ట! ఆమె స్నేహితురాల్ని కలిశాను. ఆమెకూడా చిత్రంగా మాట్లాడింది. తను సుఖపడదు – ఇతరులను సుఖపెట్టదు అని చెప్పింది. మంచి మంచి అవకాశాలను పాడుచేసుకుని ఏవేవో ఆదర్శాలు వల్లించే కలలు గనే ఓ పిచ్చిపిల్ల అని అంది. మెచ్చుకుందో తిట్టిందో అర్థం కాలేదు. చుట్టుపక్కల వాళ్ళ నడిగితే చదువుకున్నానని బలే గర్వం పడుతూ ఉంటుంది అని చెప్పారు. 'బలే మిడిసిపాటుంది- రాబోయేవాడు ఆమె చెప్పినట్లు వినాలి – వినకపోతే విడాకులిచ్చేస్తుంది.' ఇలా నానారకాలు వ్యాఖ్యానాలు చేసి నా తల తిన్నారు." అని తల పట్టుకుకూర్చున్నాడు.

హనుమంతు తన అనుభవాలు గుర్తుకొచ్చాయి పాపం! తన మిత్రుడు తనలాగే అష్టకష్టాలు పడ్డాడన్న మాట ఆ బాధ ఏమిటో తనకూ తెలుసు..

"ఒరే వీరభద్రం! తెలివితక్కువ వాడివి కాకపోతే అమ్మాయి గురించి ఎక్కడన్నా ఆరా తీస్తారా? మాటవరసకు ఆమె ప్రవర్తన మంచిది కాదనుకుందాం – కేవలం మాటవరసకే – ఆమెకు చాలామందితో సంబంధాలున్నా యనుకుందాం. నువ్వు పోయి ఆమె గురించి వాకబు చేసినా – చెబుతార్రా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం నిజం చెప్పడానికి నొప్పా?"

"నిజం చెబితే ఈ సంబంధం చేసుకుంటారా? చచ్చినా చేసుకోరు. వదిలేస్తారు. అందుకని సంబంధం చెడగొట్టడం ఇష్టంలేని వాళ్ళు ఆమె గురించి మంచిగానే చెబుతారు. ఒకవేళ నిజం చెప్పి చెడగొట్టారే అనుకుందాం- ఆ సంగతి రేపో మాపో ఆమెకి తెలియకపోదు. వీళ్ళతో గొడవలు కాకపోవు. అందుకని కావల్సిన వాళ్ళు చెడు ఉంటే దాచేస్తారు." హనుమంతు చెప్పాడు.

"అందుకేగా నేను ఆమె విరోధుల్ని కాడా విచారించింది. " వీరభద్రం మీసం మెలేస్తూ చెప్పాడు.

"అది ఇంకా తప్పు. ఆమె విరోధులు ఆమెకు వీలైనంత అపకారం చేద్దామనే చూస్తారు. నిజం కప్పిపుచ్చి అబద్ధం చెబుతారు. దాని వలన నీకు ఉపయోగం ఏమిటి?"

"మరి ఆమె గురించి మనం ఎలా తెలుసుకోవడం?" వీరభద్రం అయోమయావస్థలో పడిపోయాడు.

"ఇంతకూ ఎవరామె? పేరేంటి? అయినా దేవుడి మీద భారం వేసి చేసుకోవాలి ఈ కాలం! అయినా పేరు, అడ్రసు చెప్పి ఉంచు. వీలైతే కనుక్కుని రాస్తాను." హామీ ఇచ్చాడు ధైర్యం చెబుతూ.

"సరే అలాగే రాయి – పేరు అరుంధతి అడ్రసు..."అంటూ చెప్పుకుపోయాడు వీరభద్రం హనుమంతు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. అతనికి షాక్ కొట్టినట్లయింది.

"తస్సాదియ్యా ! అరుంధతి అరుదైన అమ్మాయి. ఆమెను చేసుకున్నవాడి బతుకు బంగారమే! ఇక ఆలోచించద్దు. ప్రొసీడ్ ! ఇంతకు అబ్బాయి పేరేంట్రా?" అతని భుజం తడుతూలేచాడురైలు వస్తూండటం చూసి.

నా చేతా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు – నాకు దిక్కు ఎవరూ లేరా అంటూ దిక్కులు పిక్కటిల్లేట్లు కేకపెట్టింది రైలు. ప్లాట్‌ఫారమ్ మీద ఆగుతూ – వైజాగ్ వెళ్ళే ట్రైన్ అది !

"అబ్బాయి పేరు సీతాపతిరా ! "వీరభద్రం చెప్పాడు.

ఇంకోసారి షాక్ తిన్నాడు హనుమంతు. ముందుకు కదలబోతూ ధైర్యం చేసి అడిగాడు.

"ఇంతకూ సీతాపతి మంచివాడేనా? యోగ్యుడా?"

ఈ సారి వీరభద్రం కంగుతిన్నాడు. "కాదన్నవాడిని చెప్పుచ్చుకు కొడతా. వాడు వజ్రం ! జాగ్రత్త! "అన్నాడు వీరభద్రం.

4608

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక)

